క్లుప్తంగా

సత్తెమ్మను దర్శించిన ఎమ్మెల్యే



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యేసూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: స్థానిక జవ్వల దొడ్డి వద్ద కొలువైన సత్తెమ్మ తల్లి అమ్మవారిను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దర్శించుకున్నారు. ఆదివారం అమ్మవారి జాతర, తీర్థం మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జ్ఞాపికను అందజేశారు. హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ ఉస్మాన్ భాషా, వైఎస్సార్ సీపీ నాయకుడు సత్తిరెడ్డి, గంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డ్రైనేజీ కల్వర్టు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

బిక్కవోలు: తొస్సిపూడిలో నిర్మిస్తున్న డ్రైనేజీ కల్వర్టు పనులను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదివారం పరిశీలించారు. రూ.25 లక్షల నిధులతో నిర్మిస్తున్న కల్వర్టు పనులు వేంగంగా జరగాలని ఆయన సూచించారు. ఆయన వెంట కొమరిపాలెం ఉప సర్పంచి కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, మండల సచివాలయాలు కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

ఘనంగా గో వృషభ కల్యాణం



గో వృషభ కల్యాణం చేస్తున్న భక్తులు

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని గో వృషభ కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివరహా స్వామి విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా ఈ కల్యాణం నిర్వహించారు. మల్లిడి శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీ ప్రభావతి దంపతులు, కొవ్వూరి రమకాంతరెడ్డి, మంగ దంపతులు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఆలయం వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చురుగ్గా డ్రైనేజీ పనులు



డ్రైనేజీ పనులు చేస్తున్న కూలీలు

రంగంపేట: కోటపాడు గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామానికి మంజూరైన నిధులతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆదివారం ఈ పనులను గ్రామ సర్పంచ్ గవరసాని లక్ష్మీదుర్గ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ గుగ్గిల వెంకటేశ్వరరావు పరిశీలించారు. డ్రైనేజీ నిర్మాణంపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు గవరసాని రాజు పాల్గొన్నారు.

తలుపులమ్మను దర్శించిన ఎమ్మెల్యే జక్కంపూడి



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రాజా

మధురపూడి: కోరుకొండ దేవుని కోనేరు వద్ద గల మాతృశ్రీ తలుపులమ్మ అమ్మవారిని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని త్రుటిలో ప్రమాదం తప్పింది. ఆదివారం తొస్సిపూడి వద్ద కల్వర్టు నిర్మాణం పనులు భాగంగా బలభద్రపురం వెళుతున్న వాహనాలు పందలపాక మీదుగా వస్తున్నాయి. అయితే పందలపాక మసీద్ వద్ద ఉన్న కాలువ దగ్గరకు వచ్చే సరికి లోడుతో ఉన్న లారీ మలుపు తిప్పలేక కాలువలోని పడబోయి నిలిచిపోయింది. దీంతో సుమారు రెండు గంటలకు ట్రాఫిక్ నిలుచిపోయింది. స్థానికులు సాయంతో లారీ వెనుక తీసుకువచ్చారు. ప్రమాదం తప్పిందన్నారు. అయితే ఈ వంతెన వద్ద తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు స్పందన

రంగంపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ అమ్మాజీ తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ స్పందనకు వివిధ శాఖల మండల స్థాయి అధికారులందరూ హాజరవుతారని మండలంలోని ప్రజలు తమ సమస్యలపై స్పందనలో తెలియపరచాలని ఆమె కోరారు.

భూసారం పెంచి.. ఆదాయం అందేలా..

- వర్మీ కంపోస్టుతో పలు లాభాలు
- తయారీలో రైతులు

బిక్కవోలు: రసాయనిక ఎరువులు, పురుగు మందులు అతిగా వాడడం వల్ల భూమి సారం క్షీణిస్తోంది. దీనివల్ల పంట నాణ్యత దెబ్బతినడమే కాకుండా దిగుబడి తగ్గుతోంది. ఈ పరిస్థితులను అధిగమించి పంట దిగుబడి, ఆదాయం పెంచేలా వ్యవసాయ శాఖ అధికారులు సేంద్రియ వ్యవసాయంలో వర్మీ కంపోస్టును అమలు చేస్తున్నారు.

వానపాములే కీలకం

వర్మీకంపోస్టు అంటే వ్యవసాయ ఉత్పత్తుల తయారీలో మిగిలిన వ్యర్థాలు, చెత్త ఆకులు, పేడ, కుళ్లిన పండ్లు, కుళ్లిన కూరగాయలకు వానపాములకు అందిస్తే తయారయ్యే సారవంతమైన ఎరువునే వర్మీ కంపోస్టు అంటారు. దీనిలో వానపాములే కీలకం. వానపాలములు మట్టిలోని సేంద్రియ పదార్థాన్ని ఆహారంగా తీసుకుంటాయి. అవి విసర్జించే మలం నేలను సారవంతం చేస్తుంది. ఇవి పంటలో వినియోగించడం వల్ల రైతులకు ఖర్చు తగ్గుతుంది. భూమి సారవంతంగా మారి అధిక దిగుబడి లభిస్తుంది.

వర్మీ కంపోస్టులో ఉండే పోషకాలు

వర్మీ కంపోస్టును పైరు వేయక ముందే పొలంలో సమానంగా చల్లి భూమిలో కలిసేలా దున్నాలి. వర్మీ కంపోస్టులో మొక్కలకు కావాల్సిన ప్రధాన, సూక్ష్మ



బిక్కవోలులో మండల పరిషత్ కార్యాలయం విక్రయించడానికి సిద్ధంగా ఉన్న వానపాములు

పోషకాలతో పాటు విటమిల్లు హార్మన్లు కూడా ఉంటాయి. 100 గ్రాముల వర్మీ కంపోస్టులో 1.56 గ్రాముల నత్రజని, 0.98 గ్రాముల భాస్వరం, 1.61 గ్రాముల పొటాష్. 0.36 గ్రాముల గంధం ఉంటాయి. ఏ పంటకైనా ఎకరాలకు టన్ను వర్మీ కంపోస్టు సరిపోతుంది.

తయారీ విధానం

- భూమికి సమానంగా 50 అడుగుల పొడవు, 3 అడుగుల వెడల్పు, అడుగు లోతు ఉండేలా బెడ్లు తయారు చేసుకోవాలి.
- బేడ్ అడుగు భాగం గట్టిగా ఉండేలా చూసుకోవాలి. ఇలాంటి బెడ్‌పై దాదాపు 45 సెంటీమీటర్లు ఎత్తు వరకు కుళ్లుతున్న వ్యర్థ పదార్థాలు వేసి వాటిపై 5 నుంచి 10 సెంటీ మీటర్ల మందం పేడ వేయాలి. వ్యర్థ పదార్థాలు, పేడ వేసేటప్పుడు బెడ్‌ను నీటితో తడపాలి. ఎప్పుడు 50 నుంచి 60 శాతం తేమ ఉండేలా చూసుకోవాలి. రోజూ నీరుపోస్తూ ఉండాలి.
- వారం తర్వాత బెడ్‌పై వానపాములను ప్రతి చదరపు మీటర్‌కు 1000 చొప్పున వదలాలి. వానపాముల ఆహారాన్ని తేమను వెతుక్కుంటూ లోపలికి వేళతాయి. పాత సంచి పట్టలు, వరిగడ్డిని బెడ్‌పై పరవాలి. ఇలా చేస్తే తేమ నిల్వ ఉండడమే కాకుండా వానపాకులకు పక్షులు, చీమల నుంచి రక్షణ ఉంటుంది. బెడ్‌లకు పందిరి నీడ ఉండాలి.
- ఇలా రెండు, మూడు నెలల్లో వర్మీ కంపోస్టు తయారవుంది. తయారైన వర్మీ కంపోస్టు నల్లగా తేలికగా ఉంటుంది. ఎరువు తయారైన తర్వాత వానపాములు అందులో ఉండకుండా పైన కప్పిన సంచి అతుక్కుంటాయి. మళ్లీ వానపాములను యాథావిధిగా కింది భాగంలో వదిలి పెట్టి గుంతల్లో వ్యవసాయ వ్యర్థాలు వేస్తే ఎరువు తయారవుతుంది.
- ఇటీవల బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయంలో వీటీ కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వాటి విక్రయిస్తున్నారు. అలాగే అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో సేంద్రియా ఎరువు వాడకంపై ప్రత్యేక అవగాహన కల్పించారు.

ఖర్చు ఆదా



సేంద్రియా ఎరువులు వాడకం వల్ల పురుగుల మందు వినియోగం తగ్గతుంది. దీంతో ఆరోగ్య వంతమైన పంటను పొందవచ్చు. అంతేకాక పెట్టుబడి తగ్గి అధిక దిగుబడి లభిస్తుంది.

–శామ్యూల్ జాన్, వ్యవసాయశాఖ ఏఇ బిక్కవోలు

సూర్యదేవునికి విశేష పూజలు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్య దేవుని దర్శనానానికి మాఘమాసం ప్రారంభం తొలి ఆదివారం స్వామివారిని దర్శించి విశేష పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ, తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

జనార్దన స్వామి ఆలయంలో..

పెదపూడి: గ్రామంలోని జనార్దనస్వామి వారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు చందవోలు సూర్య నారాయణమూర్తి, మంగతాయారు వారి కుటుంబ సభ్యులు స్వామివారి దివ్యకల్యాణం చేయించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని కల్యాణాన్ని తిలకించారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త చందవోలు వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూలోని ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకుని ఆధ్యాత్మిక ప్రశాంతత పొందాలన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల రక్షణకు పోరాడాల్సిందే

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు పిలుపు
- దివాన్‌చెరువులో యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం

రాజానగరం: ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు రాజీ లేని పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు కోరారు. విద్యారంగం విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి సరిగా లేదన్నారు. కేంద్రీకరణ, ప్రైవేటీకరణ, మతతత్వ అంశాలను కేంద్రం ప్రోత్సహిస్తోందని ఆయన విమర్శించారు. దివాన్ చెరువు డీబీవీ రాజు టౌన్ షిప్‌లోని కల్యాణ మండపంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. సమావేశంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ



సమావేశంలో మాట్లాడుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐవీ రావు

మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం కిలోమీటరు దూరంలో విద్యార్థికి పాఠశాల అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఉపాధ్యాయుల బకాయిలను తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అసంబద్ధాలను సరిచేయాలి

యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతుల్లోని అసంబద్ధాలను స రిచేసి, ఆపై పదోన్నతులు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సరి చేయకుండా పదోన్నతులు ఇస్తే ఉపాధ్యాయలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. అలాగే అమరులైన సంఘ ప్రతినిధులు చెన్నుపాటి లక్ష్మయ్య, అప్పారి వెంకటస్వామి, వత్సవాయి సూర్యనారాయణరాజు చిత్ర పటాలకు పుష్పాంజలి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.అరుణకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్, కార్యదర్శులు ఎస్ఎస్‌వీ తాతారావు, వి.వెంకటరమణ, అసోసియేట్ అధ్యక్షురాలు ఎం.విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



గ్రామంలో వృద్ధుడికి పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తిలో గడప గడపకూ మన ప్రభుత్వం

అనపర్తి: ప్రజా సాధికారత, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పారదర్శకంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం అనపర్తి గ్రామ సచివాలయం–3 పరిధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఏ ప్రభుత్వ పాలనలో పేద ప్రజలకు ఇంత లబ్ధి చేకూరలేదని, గత మూడేళ్లుగా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతోందని అన్నారు. దీంతో ఏ ఇంటికీ వెళ్లినా ప్రభుత్వ పనితీరుపై ప్రజల హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి వారు ప్రభుత్వ పథకాల వల్ల పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర భట్రాజులు కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముఖి చిట్టిరాజు, వైఎస్ ఎంపీపీ వులగం కర్రి దాసు, సర్పంచి వారా కుమారి, ఎంపీటీసీలు కొండేటి భీమేష్, బండారు శ్రీనివాస్, ఉపసర్పంచి చిర్ల వీర్రాఘవరెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో మరింత కొనుగోలు శక్తి



గాదరాడలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- గాదరాడలో గడప గడపకూ..

మధురపూడి: సంక్షేమ పథకాల అమలుతో ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగి, ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం గాదరాడలో ఆదివారం సాయంత్రం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు అవాస్తవాలు మాట్లాడుతున్నాయన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే సహించలేక విపక్షాలు అక్కసుతో విషం చిమ్ముతున్నాయంటూ విమర్శించారు. సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక, ప్రతిపక్షాలు కళ్లు కుట్టుకుంటున్నాయన్నారు. రైతులకు, సమాజంలోని అన్ని వర్గాలకు సమ న్యాయం చేయడంలో జగనన్నకు మించిన నేత లేరన్నారు. గాదరాడ గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు నిర్వహించామని, మరిన్ని పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే రాజా తెలిపారు. గ్రామంలోని బీసీ కాలనీలో 150 గడపలను ఆయన తిరిగారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరు గురించి ఈ సందర్భంగా ఆయన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు హరిబోలు చినబాబు, తోరాట శ్రీను, పాలెం నాగవిష్ణు, కవలపెల్లి శ్రీను, చీర్ల శివసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కానిస్టేబుల్ పరీక్షకు 601 మంది హాజరు



అనపర్తి జీబీఆర్ పరీక్షా కేంద్రం వద్ద పర్యవేక్షిస్తున్న అనపర్తి సీఐ శ్రీనివాసరావు

అనపర్తి: స్థానిక జీబీఆర్ కళాశాలలో నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షకు 601 మంది అభ్యర్థులు హాజరైనట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగాయని, రాజమహేంద్రవరం నార్త్‌జోన్ డీఎస్పీ వెంకటేశ్వరరావు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్టు తెలిపారు. మొత్తం 668 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 67 మంది అభ్యర్థులు గైర్హజరు అయ్యారని తెలిపారు.

గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే పర్యటన

రంగంపేట: మండలంలోని సుభద్రంపేట, వెంకటాపురం గ్రామాల్లో ఆదివారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రస్తుత ప్రభుత్వ హయాంలో గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరిగిపోయాయని ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఆయన గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకన్న రథానికి వంగలపూడిలో అపూర్వ స్వాగతం



వంగలపూడిలో భక్తులకు కుంకుమ అక్షింతలు అందిస్తున్న ప్రచార రథం ప్రెసిడెంట్ శ్రీనివాస్

సీతానగరం: శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి సనాతన హిందూ ధర్మ ప్రచార రథానికి వంగలపూడి గ్రామస్తులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. మండలంలోని పురుషోత్తపల్లి పంచాయతీ పరిధిలోని రామచంద్రవరంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి వచ్చిన ఈప్రచార రథానికి వంగలపూడిలో వైఎస్సార్ సీపీ నాయకుడు కొంచ భాస్కరరావు, సర్పంచ్ అన్నపూర్ణ దంపతుల ఆధ్వర్యంలో సాదర స్వాగతం పలికారు. రథంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారికి గ్రామస్తులు విశేష పూజలు చేశారు. వీధులను పసుపు నీటితో శుద్ధి చేస్తూ కోలాట నృత్యం చేస్తుండగా రథ యాత్ర కొనసాగింది. ప్రచారరథం ప్రెసిడెంట్, గాయకుడు కరుటూరి వెంకట శ్రీనివాస్ రథం వద్ద భక్తులకు గోవింద నామాలు, కుంకుమ, అక్షింతలు అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అనపర్తి: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్నేహితులు స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. దుప్పలపూడికి చెందిన చంద్రపాటి సాయి, జె.తురణ్‌రాం, మరో యువకుడితో కలిసి ముగ్గురు స్నేహితులు ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తూ ఫ్లైఓవర్ బ్రిడ్జిపైకి వచ్చే సరికి అదుపుతప్పి ఫుట్‌పాత్, రైలింగ్‌ను ఢీకొని పడిపోయారు. ఈ ప్రమాదంలో చంద్రపాటి సాయి కుడి కాలుకు తీవ్ర గాయం కాగా తరుణ్‌రాం తలకు బలమైన గాయమైంది. క్షతగాత్రులను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి, సిబ్బంది వైద్య సేవలు అందించారు. ఇదిలా ఉండగా తరుణ్‌రాంను మెరుగైన వైద్య సేవలు నిమిత్తం రాజమహేంద్రవరం సర్వజన ఆసుపత్రికి తరలించినట్టు వైద్యులు తెలిపారు.



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తరుణ్‌రాం

అభివృద్ధి పనుల్లో పారదర్శకత పాటించాలి

పెదపూడి: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పారదర్శకత పాటించాలని ఎమ్మెల్యే డాక్టర్‌సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామం శివారు ఎల్ఎస్ పురంలో వాటర్ ట్యాంకునిర్మాణ పనులు ఎమ్మెల్యే ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ పనులు ఎంత మేర జరిగాయో, ఎప్పటిక పూర్తవుతాయో, పనులు ప్రజల పర్యవేక్షణలో జరుగుతున్నాయో లేదో అని అధికారులు, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పనులు సకాలంలో పూర్తి చేసి వాటర్ ట్యాంకు వినియోగంలోకి తీసుకురావాలన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు లోపిస్తే సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచి మేడపాటి తాతారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి వెంకట పద్మావతి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, పైన సొసైటీ చైర్మన్ సబ్బెళ్ల అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఎస్‌పురం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

సత్తెమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే

జి.మామిడాడ గ్రామ శివారు ఎల్ఎస్‌పురంలో సత్తెమ్మ తల్లి జాతర సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వెంట వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మారెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు ద్వారంపూడి ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా అమ్మవారి సంబరం

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలోని చిన్నం వంశీయుల సత్తెమ్మ తల్లి సంబరం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏటా మాఘమాసం మొదటి ఆదివారం ఈ సంబరం నిర్వహించారు. గరగనృత్యాలు, డోలు సన్నాయి మేళాలతో అమ్మవారిని గ్రామమంతా ఊరేగించారు. చిన్నం వంశీయుల ఆడపడుచుల రాకతో గ్రామం అంతా కోలాహాలంగా మారింది. అనంతరం భారీ ఎత్తున అన్నసమారధన చేశారు. అనంతరం భక్తులు అమ్మవారి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



కొంకుదురులో సత్తెమ్మతల్లి దర్శించుకున్న చిన్నం వంశీయులు

డ్రగ్ ట్రేడ్ సంఘాల నూతన కార్యవర్గాల ఎన్నిక



దొరబాబును సన్మానిస్తున్న సభ్యులు

రాజానగరం: మానవుడు సంఘజీవి అని, సంఘం బలోపేతంగా ఉంటేనే సంఘానికి, సమాజానికి మేలు జరుగుతుందని రాజమమహేంద్రవరం డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. రాజానగరం, రంగంపేట మండలాల డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆదివారం జరిగాయి. అనంతరం జిల్లా ఎన్నికల కమిటీ కన్వీనర్ బలభద్ర వెంకట్రాజు, కో–కన్వీనర్ ఆర్. శ్రీనివాసరావు, ఆధ్వర్యంలో పై రెండు మండలాలకు డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. రాజానగరం మండలానికి అధ్యక్షుడిగా లంక దొరబాబు (రాజానగరం), కార్యదర్శిగా ఎం.భానుశంకర్ (చక్రద్వారబంధం), కోశాధికారిగా కె.దుర్గారావు (తుంగపాడు), రంగంపేట మండలానికి అధ్యక్షుడిగా సీహెచ్ ప్రభాకరరావు (వడిశలేరు), కార్యదర్శిగా ఎ.నాగేశ్వరరావు (కోటపాడు), ఎం.శ్రీనివాసరావు (సింగంపల్లి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ గోకవరం, సీతానగరం, కడియం, ధవళేశ్వరం శాఖల అధ్యక్షులు కె. చక్రవర్తి, ఎం.ప్రభాకరరావు, కె.బాబీ, జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ: ఇద్దరికి గాయాలు

రాజానగరం: జాతీయ రహదారిపై దివాన్ చెరువు జీరో పాయింట్ నుంచి గామన్ బ్రిడ్జికి వెళ్లే రోడ్డుపై ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీ కొనడంతో సుమారు గంటన్నర పాటు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. టు–వేగా ఉన్న ఈ రహదారిపై కొవ్వూరు నుంచి వచ్చే వైపు మరమ్మతులు చేస్తుండడంతో మరొక వైపు నుంచే వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కాకినాడ నుంచి చిలకలూరిపేటకు ఇద్దరు ప్రయాణకులతో వెళ్తున్న టాటా సఫారీ వాహనం హైదరాబాద్ నుంచి ఒడిశాకు ముగ్గురు ప్రయాణికులతో వెళ్తున్న వేగినార్ వాహనం ఢీ కొన్నాయి. ఈ సమయంలో టాటా సఫారీలో బెలూన్లు ఓపెన్ కావడంతో అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులు సురక్షితంగా బయట పడ్డారు. వేగినార్‌లో ప్రయాణిస్తున్న వారిలో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంతో ఆ రహదారి పై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న రాజానగరం సీఐ కాశీ విశ్వనాథ్ తమ సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించి, సత్వరమే ట్రాఫిక్ క్లియర్ చేయించారు.



గామన్ బ్రిడ్జిపై ఏర్పడిన ట్రాఫిక్ జామ్